క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక మధురానగర్ గౌతమ పాఠశాలలో ఆదివారం విజయవాడ లయన్స్ క్లబ్ ఆఫ్ చుండూరి వెంకటరెడ్డి ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం జరిగింది. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరి ముఖ్య అతిథిగా పాల్గొని ఎలక్ట్ గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు, ఫస్ట్ వైస్ గవర్నర్ ఎస్వీఎస్ ప్రసాద్, సెకండ్ వైస్ గవర్నర్ శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్, రీజనల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ అన్నాబత్తుల శరాబందీరావుతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం సుమారు 300 మందికి ప్రముఖ గుండె, ఈఎన్‌టీ, ప్రసూతి, బీపీ, షుగర్ తదితర వైద్య నిపుణులు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో సీవీఆర్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ హనుమంతరావు, సెక్రెటరీ నాగరాజు, కోశాధికారి రూపునాథ్, డీసీ ఇమామ్ భాష, రషీద్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దాత చంపాలాల్, గిరీష్, వినోద్, ప్రకాష్‌కుమార్ చౌహాన్ సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ రవికిరణ్ బొబ్బా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వయోవృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ, ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం వయోవృద్ధులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్‌ఛైర్మన్ తేజ్‌రాజ్‌సోలంకీ, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ మాధవి, ట్రస్టీలు ఎస్వీయూ సతీష్‌కుమార్, తట్టి అర్జునరావు, లక్ష్మీనరసింహారావు, జీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మధురంగా సాగిన సంగీత కచేరీ



విజయవాడ కల్చరల్: స్వరతరంగిణి ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం దుర్గాపురంలోని శివరామకృష్ణక్షేత్రంలో యువ సంగీత కళాకారిణి సోమయాజుల విష్ణుప్రియ ఇందిర నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. సంగీత త్రిమూర్తులు త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, వాగ్గేయకారులు అన్నమయ్య, రామదాసు కీర్తనలు ఆలపించారు. చెన్నైకి కుందుర్తి అరవింద్, అంబటిపూటి కామాక్షి వాద్య సహకారం అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత విద్వాంసుడు గండూరి శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ యువ గాయనీ గాయకులను ప్రోత్సహించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): క్షణికావేశంతో గొడవలకు పాల్పడటం, అల్లర్లు చేయడం వల్ల జీవితాలు అంధకారంగా మారతాయని అజిత్‌సింగ్‌నగర్ సీఐ బీహెచ్ వెంకటేశ్వర్లు సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, పాతనేరస్తులకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మానవ జీవితం ఎంతో అందమైనదని.. కానీ కొంతమంది యువత చెడు వ్యసనాలు, స్నేహాల వల్ల ఆ జీవితాన్ని అంధకారంగా మార్చుకుంటున్నారన్నారు. సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలి తప్ప లేనిపోని గొడవలకు వెళ్లడం మంచి పద్ధతి కాదన్నారు. పాత నేరస్తులు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని.. ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే చట్టరీత్యా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఇలా.. రాకపోకలు ఎలా.?

- ఆక్రమణల చెరలో ఫుట్‌పాత్‌లు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న పాదచారులు



ఫుట్‌పాత్‌పై పార్కింగ్ చేసిన తోపుడు బండ్లు, కొబ్బరి బోండాల వ్యాపారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా వేలాదిమంది రాకపోకలు సాగించే బీఆర్టీఎస్ రోడ్డు ఫుట్‌పాత్ హాకర్‌లకు అడ్డాగా మారింది. హాకర్లు, ఆక్రమణదారులు ఫుట్‌పాత్‌లపైనే ఇష్టారాజ్యంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో బీఆర్టీఎస్ రోడ్డులో కనీసం నడిచేందుకు దారి లేక పాదచారులు రద్దీగా ఉండే రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డుపై రాకపోకలు సాగించే క్రమంలో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వేలాదిమంది రాకపోకలు సాగించే బీఆర్టీఎస్ రోడ్డు ఫుట్‌పాత్ ఆక్రమణలకు గురైనా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై కనీసం నడిచేందుకు వీలులేకుండా బడ్డీలు ఏర్పాటు చేయడంతో పాటు నడవకుండా హాకర్లు అడ్డుగా తాడు కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్కింగ్ కేంద్రాలుగా ఫుట్‌పాత్‌లు

బీఆర్టీఎస్ రోడ్డులోని ఫుడ్‌కోర్టు వ్యాపారులు తమ బడ్డీలను ఫుట్‌పాత్‌లపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బడ్డీలు ఫుట్‌ఫాత్‌లపైనే ఉండిపోతున్నాయి. దీంతో పాదచారులు నానాయాతన పడుతున్నారు. ముఖ్యంగా ఇక్కడకు అత్యంత సమీపంలోని దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాల, శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఫుట్‌పాత్‌లు లేక రోడ్డుపైనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అలాగే రోడ్డు పక్కన, ఫుట్‌పాత్‌లపై బడ్డీలను ఏర్పాటు చేయడం వల్ల రోడ్డు ఇరుకుగా మారి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



దుర్గాపురం బీఆర్టీఎస్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై పార్కింగ్ చేసిన బడ్డీలు



ఫుట్‌పాత్ పక్కన నిలిపిన బండ్లు

అసాంఘిక కార్యకలాపాలు

దుర్గాపురం ఎస్టీవీఆర్ పాఠశాల సమీపంలో ఫుట్‌పాత్‌లకు అడ్డంగా బడ్డీలను ఏర్పాటు చేయడం ఆకతాయిలు, మందుబాబులకు వరంగా మారింది. ఇక్కడే మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దీంతో పాదచారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించి రాకపోకలకు వీలుగా సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళా అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం



సందేశం ఇస్తున్న శ్రీ పరంజ్యోతి కల్కి భగవద్ దాసాజీ

ఆటోనగర్(విజయవాడతూర్పు): మహిళలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని శ్రీ పరంజ్యోతి కల్కి భగవద్ దాసాజీ ప్రబోధించారు. ఆటోనగర్‌లోని ఏటీపీ హాలులో ఆదివారం ఎనిమిది గంటల జ్ఞాన తరగతులను మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ గద్దె అనురాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ భగవాన్ ప్రబోధించిన స్త్రీ సాధికారత వివరించారు. శ్రీ పరంజ్యోతి అనుగ్రహంతో స్త్రీ చైతన్యంలో ప్రశాంత స్థితిని, ప్రేమస్థితి, ఆనంద స్థితిని, కరుణస్థితిని నింపే క్రమంలోనే ఇటువంటి శిక్షణ తరగతులు దోహదపడుతాయన్నారు. మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ గద్దె అనురాధ మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మహిళ శ్రేయస్సుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో వెయ్యికి పైగా మహిళలు పాల్గొన్నారు.

సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలి



గ్రంథావిష్కరణ సభలో మండలి బుద్ధప్రసాద్, సంగయ్య తదితరులు

విజయవాడ కల్చరల్: సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మాధురి ప్రచురణలు ఆధ్వర్యాన సాహితీ మిత్రుల సమక్షంలో ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో డాక్టర్ లగడపాటి సంగయ్య రచించిన మూడు కావ్యాలు తెలుగు ధీర శతకం, ఆంధ్ర రఘువంశం, పల్లెపట్నం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కావ్యాలను ఆవిష్కరించిన మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సాహిత్యానికి సమకాలీనత, సార్వజనీత ఉండాలని అన్నారు. పద్యకావ్యమైన, కవిత్వమైన, శతకమైన సమాజ శ్రేయస్సు కనిపించాలన్నారు. పద్యసాహిత్యంలో రచయిత సంగయ్య కృషిని అభినందించారు. శతావధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ కాశీదాసు మేఘసందేశం గురించి వివరించారు. విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మా సాంబశివరావు శత సాహిత్యంపై మాట్లాడారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు, లగడపాటి రమాదేవి పాల్గొన్నారు.

వర్సిటీల్లో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం సరికాదు

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటగోపి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విశ్వవిద్యాలయాల్లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం సరికాదని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర కార్యదర్శి వెంకటగోపి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో జరిగిన చంద్రబాబు పుట్టినరోజు వేడుకల్లో వర్సిటీ వీసీతో పాటుగా ప్రొఫెసర్లు పాల్గొనడాన్ని చూస్తుంటే విశ్వవిద్యాలయాలు తెలుగుదేశం పార్టీ కార్యాలయాలుగా మారాయా అనే సందేహం కలుగుతోందని అన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఇటువంటి రాజకీయ పోకడలను ఏబీవీపీ వ్యతిరేకిస్తుందని, మళ్లీ ఇటువంటి సంఘటనలు పునరావృతం అయితే తమ పరిషత్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపం ప్రారంభం



కల్యాణ మండపం ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమా

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలో నూతనంగా నిర్మించిన కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపం ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య)తో కలిసి కల్యాణ మండపం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపం నూతన కార్యవర్గం అధ్యక్షుడు తుమ్మలపెంట శ్రీనివాస్, సభ్యులతో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కమిటీ నూతన అధ్యక్షుడు తుమ్మలపెంట శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

గీతా మందిరంలో శాంతి హోమం



అభిభాషణం చేస్తున్న ముక్కపాటి శర్మ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీ గీతా మందిరంలో మహా సంప్రోక్షణ కుంభాభిషేకంలో భాగంగా రెండో రోజైన ఆదివారం మహా శాంతి యాగం, మహాశాంతి కుంభారాధన కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ మహర్షి సద్గురు మలయాళస్వామి వారి దివ్యాశీస్సులతో యేర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా సంప్రోక్షణ కుంభాభిషేక కార్యక్రమాల్లో కర్మయోగ ఫలం పై చిన కంచి ట్రస్టీ ముక్కపాటి శర్మ భక్తులకు అభిభాషణం చేశారు. అలాగే ఉదయం అర్చకస్వామి రొంపిచర్ల దత్తకుమార్ బృందం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచన, అగ్నిధాన్యములు, నిత్య హోమం, నవగ్రహముఖ ఆరాధన, నవగ్రహ హోమం, నివేదన, హారతి, మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం లోక కల్యాణార్థం అగ్నిధ్యానం, మహాశాంతి హోమం, పూర్ణాహుతి, నివేదన, హారతి కార్యక్రమాలు జరిగాయి. మూడు రోజుల కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజైన సోమవారం ప్రత్యేక పూజలతో పాటు శ్రీశ్రీనివాస కల్యాణ మహాదాశీర్వచనం నిర్వహించనున్నట్లు గీతా మందిరం భక్త బృందం కమిటీ తెలిపింది.

సేవలు విస్తృతం చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజానికి అవసరమైన సేవలను మరింత విస్తృతం చేయాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. భారత్ వికాస్ పరిషత్ విజయవాడ డివిజన్ నూతన కార్యవర్గ సమావేశం ఆదివారం పాతబస్తీలోని ఒక ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వేముల హజరత్తయ్యగుప్తా మాట్లాడుతూ నాయకులలో సేవా తత్పరత వెల్లివిరియాలన్నారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను నేటి తరానికి అందించేందుకు దేశ ప్రధాని స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు పెనుగొండ సుబ్బరాయుడు మాట్లాడుతూ భారత్ వికాస్ పరిషత్ సేవలను కొనియాడారు. ముందు పని చేసిన ప్రముఖుల సేవలను కొనసాగిస్తూ సమాజానికి మరిన్ని సేవలందించాలని సూచించారు. సంస్థ నూతన అధ్యక్షుడిగా చందోలు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా కడం కష్ణమూర్తి, కోశాధికారిగా బ్రహ్మానందం తదితరులతో సంస్థ సీనియర్ నేత ఎస్.శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. సంస్థ ప్రముఖులు బి.మల్లికార్జునరావు, టీవీ గుప్తా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసుల స్పెషల్ డ్రైవ్



తిరువూరులో జాతీయ రహదారిపై లారీ డ్రైవర్లకు సూచనలిస్తున్న పోలీసులు

తిరువూరు: రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా లారీ డ్రైవర్లకు స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో కార్యక్రమాన్ని తిరువూరు పోలీసులు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు సూచనల మేరకు విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై రాత్రివేళల్లో నిద్రలేమితో వాహనాల డ్రైవర్లు ప్రమాదాలకు గురవుతున్నందున తెల్లవారుజామున మూడు నుంచి ఐదు గంటల సమయంలో వారు కొద్దిసేపు విశ్రాంతి తీసుకునే విధంగా తిరువూరు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది జాతీయ రహదారిపై వాహనదారులకు స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

లారీని ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సేకరించిన సమాచారం ప్రకారం.. కంచికచర్ల మండలం బత్తినపాడు గ్రామానికి చెందిన చింతపల్లి రాజు (35) గ్రామస్తులతో కలిసి వేళంకిని మాత దర్శనం కోసం ఐదు రోజుల కిందట నాగపట్నం వెళ్లాడు. గతంలో భార్య చనిపోవడంతో తన 11 ఏళ్ల కుమార్తెను గొల్లపూడిలోని తన సోదరుని ఇంటి వద్ద వదిలి వెళ్లాడు. ఆదివారం తన కుమార్తెను తీసుకువచ్చేందుకు బైక్‌పై గొల్లపూడి బయలుదేరాడు. మూలపాడు వద్దకు చేరుకునేసరికి బైకు అదుపుతప్పి హైవే పక్కన ఆగి ఉన్న లారీని వెనక వైపు ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాజు తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రీస్తు మార్గమే మానవాళికి రక్షణ



రాజీవ్‌నగర్‌లోని చర్చిలో జరిగిన ప్రార్థనల్లో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ఘనంగా ఈస్టర్ వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో క్రైస్తవ విశ్వాసులు ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. పెద్ద సంఖ్యలో చర్చిలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. మధురానగర్ కొబ్బరి తోటలోని జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ ప్రార్థన మందిరంలో ఈస్టర్ వేడుకలు జరిగాయి. రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం ఈస్టర్ సందేశాన్ని వివరించారు. అలాగే అంబేడ్కర్ కాలనీ షియోను ప్రార్థన మందిరంలో రెవరెండ్ పాస్టర్ కనమాల వరప్రసాద్ ఈస్టర్ ప్రార్థనలు చేశారు. క్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని సూచించారు. బేతేలు మినిస్ట్రీస్ ప్రార్థన మందిరంలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో బేతేలు మినిస్ట్రీస్ బైబిల్ కళాశాల ప్రెసిడెంట్ అండ్ డైరెక్టర్ రెవరెండ్ పాస్టర్ డాక్టర్ సల్లూరి జయకుమార్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని విశ్వాసులకు ఈస్టర్ సందేశం ఇచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. బేతేలు మినిస్ట్రీస్ సంఘ పెద్దలు యలమర్తి అబ్రహాం, మద్దాస్ నరేంద్ర, కాటూరి కృష్ణ పాల్గొన్నారు. బుడమేరు మధ్యకట్ట మహిమా మినిస్ట్రీస్ ప్రార్థన మందిరంలో ఈస్టర్ వేడుకలు జరిగాయి. మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బిషప్ ఎం మోహన్‌కుమార్ ప్రార్థనలు చేశారు. క్రీస్తు పాపుల రక్షణార్థమై శిలువపై తన రక్తాన్ని చిందించి ప్రాణ త్యాగం చేశారని పేర్కొన్నారు. రామకృష్ణాపురం ఫుల్‌గాస్పల్ చర్చిలో పాస్టర్ డాక్టర్ డానియేల్ ప్రార్థనలు నిర్వహించారు.

క్రీస్తు బోధనలు ఆదర్శం

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వ్యాప్తంగా క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. రాజీవ్‌నగర్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు పునరుజ్జీవానికి గుర్తుగా క్రైస్తవులు ఈస్టర్ పండుగను జరుపుకొంటారని అన్నారు. మానవత్వంతో కూడిన శాంతియుత జీవనం క్రీస్తు ఎంచుకున్న మార్గమని తెలిపారు. ఏసుక్రీస్తు బోధనలు ప్రజల మధ్య శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లివిరిసేలా చేస్తాయన్నారు. ప్రభువు దీవెనలు నియోజకవర్గ ప్రజలపైన, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పైన మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాస్టర్ సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి ఏసు, నాగిరెడ్డి, రమణారెడ్డి, రాజు, జగదీష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



మహిమ మినిస్ట్రీస్ మందిరంలో ఈస్టర్ సందేశం ఇస్తున్న బిషప్ మోహన్‌కుమార్




షియోను చర్చిలో ప్రార్థనలు చేస్తున్న రెవరెండ్ డాక్టర్ వరప్రసాద్

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు డిమాండ్

మైలవరం: రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు నెలలకు పైగా ఉపాధి కూలీలకు వేతనాలు రాక వారి కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. ఉపాధి కూలీల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మైలవరం నియోజకవర్గంలో ఉపాధి పనులు జరుగుతున్న వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ఎండలు మండిపోతున్నా కనీసం మజ్జిగ, మంచినీళ్లు, టెంట్‌ల వసతి కల్పించడం లేదని కూలీలు వాపోయారు. ఆయన మాట్లాడుతూ నాలుగున్నర లక్షల కోట్ల రూపాయలకు పైగా ఉపాధి నిధులు అవసరం ఉండగా ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుకార్చాలనే పట్టుదలతో ఉందని ఆరోపించారు. అరకొరగా ఉన్న ఈ నిధులను కూటమి ప్రభుత్వం సంబంధం లేని పనులకు కేటాయిస్తోందని విమర్శించారు. గత కొంతకాలంగా ఉపాధి కూలీలకు ఇవ్వాల్సిన పరికరాలు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోందని, ఇది దారుణమన్నారు. వెంటనే వేతన బకాయిలు చెల్లించాలని కోరారు.

● ఆదివారం ఆటవిడుపు...



విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం ఆదివారం కిటకిటలాడింది. సెలవు కావడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు స్టేడియానికి చేరుకొని వివిధ రకాల ఆటలు ఆడారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన స్కూల్ స్థాయి నుంచి కళాశాలలో చదివే విద్యార్థుల వరకు భారీగా స్టేడియానికి వచ్చారు. ఎక్కువ మంది క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. జట్లుగా ఏర్పడి క్రికెట్ పోటీలు నిర్వహించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం, చిట్టినగర్‌లోని సర్కిల్-1, సత్యనారాయణపురంలోని సర్కిల్-2, పటమటలోని సర్కిల్-3 కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో జరిగే కార్యక్రమంలో జోనల్ కమిషనర్‌లు, స్థానిక అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్, చుట్టుగుంట సబ్‌స్టేషన్ 11 కేవీ సీతారామపురం ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం ఎనిమిది నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాలాంధ్ర ప్రెస్, విశాలాంధ్ర ప్రెస్ రోడ్, బోయపాటి వారి వీధి, శ్రీనివాసరావు వీధి, నేతాజీ వీధి, బారిస్టర్ వారి వీధి, బంకపల్లివారి వీధి, పాపయ్య వీధి, స్వాతి ప్రెస్ ఏరియా, కడియాలవారి వీధి, బెల్లపుశోభనాద్రి వీధి, చలసాని వెంకటకృష్ణయ్య వీధి, కోవెలమూడివారి వీధి, ఎంజేనాయుడు హాస్పిటల్ ఏరియా, దాసరివారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కుమార్తె అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): టిఫిన్ తీసుకొచ్చేందుకు కొండ దిగిన తన కుమార్తె కనిపించకుండా పోయిందని తల్లి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. కలరా హాస్పటల్ కొండ ప్రాంతంలోని జొన్నలగడ్డ మస్తాన్ వీధిలో తమ్మిశెట్టి సుమలత, వీరన్న దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం కాగా కుమార్తె భవానీకి వివాహం చేశారు. అయితే అల్లుడికి కిడ్నీ సమస్య రావడంతో వారం రోజుల కిందట భవానీ, భర్తను తీసుకుని పుట్టింటికి వచ్చింది. 16వ తేదీ ఉదయం భర్తకు టిఫిన్ తీసుకొస్తానని చెప్పి కొండ దిగిన భవానీ సాయంత్రం అయినా తిరిగి రాలేదు. దీంతో బంధువులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో తల్లి సుమలత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.